ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

గురువారం 31 జూలై 2025



10 రోజుల విరామం తర్వాత

నేడు సచివాలయానికి సీఎం

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పది రోజుల విరామం తర్వాత గురువారం ఉదయం సచివాలయానికి రానున్నారు. ఆ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే కార్యక్రమాల్లో పాల్గొని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పూర్తయిన పథకాలను ప్రారంభించనున్నారు. ఈ నెల 21 ఉదయం వాకింగ్ వెళ్ళిన స్టాలిన్ ఉన్నట్టుండి అస్వస్థతకు గురవండంతో వెంటనే ఆయనను అపోలోఆస్పత్రికి తరలించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ వైద్యనిపుణుల పరిశీలనలోనే ఉంటూ ఆస్పత్రి నుంచే తన విధులను నిర్వర్తించారు. ఆదివారం సాయంత్రం స్టాలిన్ ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు. గత మూడు రోజులుగా ఆయన ఇంటివద్దే ఉంటూ పూర్తిగా విశ్రాంతి తీసుకున్నారు. కుటుంబ సభ్యులను, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం మాత్రమే కలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి స్టాలిన్ పదిరోజుల తర్వాత సచివాలయానికి రానున్నారు. ఆ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్‌కు పలికేందుకు మంత్రులు, ఉన్నతాధికారులు పార్టీ సీనియర్‌నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలుకనున్నారు.


2నుంచి నాలుగు రోజులు భారీవర్షాలు

పెరంబూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పడమటి గాలుల వేగంలో మార్పుల కారణంగా రాష్ట్రంలో ఆగస్టు 2 నుంచి 5వ తేది వరకు ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములతో కూడిన మోస్తరు నుంచి భారీవర్షం కురిసే అవకాశముంది. ఈ మేరకు ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... తిరువారూరు, నాగపట్టణం, మైలాడుదురై, పుదుకోట తదితర జిల్లాలు, కారైక్కాల్ ప్రాంతాల్లో ఒకటి రెండు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ పగటి ఉష్ణోగ్రతలు 36-37 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 28-29 డిగ్రీల వరకు ఉంటాయని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

26న మళ్లీ రాష్ట్రానికి ప్రధాని

● తిరువణ్ణామలై, చిదంబరం ఆలయాల సందర్శన

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ మళ్ళీ రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఈ నెల 26 ప్రధాని మోదీ తూత్తుకుడిలో పునర్నిర్మించిన ఎయిర్‌పోర్ట్ ప్రారంభించి, మరుసటి రోజు గంగైకొండచోళపురం రాజేంద్రచోళుడి జయంత్యుత్సవాల్లో పాల్గొన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో రెండు రోజుల పర్యటన నిమిత్తం మోదీ రాష్ట్రానికి విచ్చేయనున్నారు. ఆగస్టు 26నుంచి 27 దాకా ఆయన తిరువణ్ణామలై, కడలూరు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఆ సందర్భంగా తిరువణ్ణామలై ఆలయాన్ని సందర్శించి, ఆ తర్వాత కడలూరు జిల్లా చిదంబరంలోని నటరాజస్వామి ఆలయంలో జరిగే ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. ఆ ఆలయం నుంచే మోదీ 'మన్‌కీ బాత్' కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారంలోనూ పాల్గొననున్నారు. ఇదే విధంగా సెప్టెంబర్ లోనూ మోదీ రాష్ట్రంలో పర్యటించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.



వైద్య కోర్సుల కౌన్సెలింగ్ ప్రారంభం

● దివ్యాంగులకు పూర్తయిన సీట్ల కేటాయింపు ● 5న తొలి రౌండ్ ఫలితాలు

అడయార్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఉన్న ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీ కోసం ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ఒమందూరార్ ప్రభుత్వ వైద్య కాలేజీ ఆడిటోరియంలో బుధవారం ప్రారంభమైంది. తొలి రోజు దివ్యాంగుల కోటా సీట్లను ఆఫ్‌లైన్‌లో కేటాయించారు. సీట్లు పొందినవారికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి ఎం.సుబ్రమణ్యం ధృవీకరణ పత్రాలను అందజేశారు. మరోవైపు, ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నమోదు ప్రక్రియ కూడా బుధవారం నుంచే ప్రారంభమైంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆగస్టు 6వ తేదీ ఫలితాలను విడుదల చేయనున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను రాష్ట్రంలోని వైద్య విద్యా కాలేజీల్లో ప్రవేశాలను భారత వైద్య విద్యా మండలి షెడ్యూల్ మేరకు రాష్ట్ర కోటాలోని సీట్లను వైద్య ఆరోగ్య శాఖ భర్తీ చేయనుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కాలేజీల్లో కలిపి 6,600 ఎంబీబీఎస్ సీట్లు, 1,583 బీడీఎస్ సీట్లున్నాయి. వీటిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 7.5 శాతం అంటే 495 ఎంబీబీఎస్, 119 బీడీఎస్ సీట్లు కేటాయిస్తారు. మిగిలిన సీట్లను 92.5 శాతం రిజర్వేషన్ కింద భర్తీ చేయనున్నారు. ఈ సీట్ల భర్తీ కోసం జూన్ 6వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానించగా, మొత్తం 72,743 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో అర్హులైన అభ్యర్థులకు నీట్ మార్కుల ఆధారంగా ఈ నెల 25న రాష్ట్ర స్థాయిలో ర్యాంకు జాబితా ప్రకటించారు. ఈ నేపథ్యంలో సీట్ల కోసం 30వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఆగస్టు 4వ తేదీ సాయంత్రం 5 గంటలతో ముగుస్తుంది. 5వ తేదీన సీట్ల కేటాయింపు, 6వ తేదీన ఫలితాలను వెల్లడిస్తారు. తొలి రౌండ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆగస్టు 6వ తేదీ నుంచి 11వ తేదీలోగా తమకు కేటాయించిన వైద్య కాలేజీలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఇదిలావుంటే, దివ్యాంగులు, స్పోర్ట్స్ కోటా, మాజీ సైనికోద్యోగుల వారసులకు ప్రత్యక్ష కౌన్సెలింగ్ బుధవారం నుంచి ప్రారంభించారు.



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

తల్లీకుమార్తెకు ఎంబీబీఎస్ సీటు

ఈ కౌన్సెలింగ్‌కు హాజరైన వారిలో తెన్‌కాశి జిల్లా శివగిరి తాలూకాలోని విశ్వనందబేరీ అనే గ్రామానికి చెందిన తల్లీకూతుళ్లు హాజరయ్యారు. వీరిలో 49 యేళ్ళ అముద అనే మహిళ దివ్యాంగుల కోటాలో విరుదునగర్ ప్రభుత్వ వైద్య కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సంపాదించగా, ఆమె కుమార్తె 18 యేళ్ళ సంయుక్త 7.5 శాతం రిజర్వేషన్ కింద ఎంబీబీఎస్ సీటు పొందారు. కాగా 7.5 శాతం రిజర్వేషన్ కింద రాష్ట్రంలో 572 మార్కులతో మొదటి స్థానంలో నిలిచిన కళ్లకుర్చి జిల్లా తిరుకోవిలూర్ తాలూకా తిరుమూర్తికి మద్రాస్ మెడికల్ కాలేజీలో సీటు లభించింది. దివ్యాంగులు కోటా, 7.5 శాతం రిజర్వేషన్ కింద సీట్లు పొందిన విద్యార్థులకు రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి ఎం.సుబ్రమణ్యం సీట్ల అలాట్‌మెంట్ లెటర్ స్వయంగా అందజేశారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఖుష్బు



ప్యారీస్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటి ఖుష్బు రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షురాలిగా నియమితులైనట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ప్రకటించారు. టి.నగర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయం కమలాలయంలో బుధవారం సాయంత్రం నటి ఖుష్బుతో పాటు ఉపాధ్యక్షులుగా నియమితులైన 14 మంది జాబితా విడుదల చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అనుమతితో రాష్ట్ర విభాగానికి నూతన నిర్వాహకులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఎం.చక్రవర్తి, వీపీ దురైస్వామి, కేపీ రామలింగం, కరునాగరాజన్, శశికళ పుష్ప, కనక సభాపతి, డాల్ఫిన్ శ్రీధర్, ఏజీ సంపత్, జయప్రకాశ్, ఎం.వెంకటేశన్, గోపాల్‌స్వామి, ఖుష్బు, ఎన్.సుందర్ పాల్ కనకరాజ్‌లను పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా కేశవ వినాయగం, బాలగణపతి, రామ శ్రీనివాసన్, ఎం.మురుగానందం, కాత్యాయణి, ఏబీ మురుగానందం నియమితులయ్యారు. కాగా, బీజేపీ రాష్ట్ర కార్యదర్శులుగా కరాటే త్యాగరాజన్, అమర్‌ప్రసాద్ రెడ్డిలతో పాటు 15 మంది నియిమితులయ్యారు. రాష్ట్ర కోశాధికారిగా ఎస్ఆర్.శేఖర్, పార్టీ కార్యాలయ కార్యదర్శిగా ఎం.చంద్రన్, ప్రధాన కార్యాలయ ప్రచారకర్తగా నారాయణన్ తిరుపతిలతో పాటు పార్టీ అధిష్ఠానం అనుమతించిన వారిని పార్టీ పదవులకు ఎంపిక చేసినట్లు నయినార్ నాగేంద్రన్ తెలిపారు.



పార్టీ సభ్యత్వం కోసం మొబైల్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న టీవీకే నేత విజయ్ - టీవీకే సభ్యత్వం స్వీకరించిన ఒకే కుటుంబంలోని మూడు తరాలవారితో విజయ్

రాష్ట్రంలో కొత్త చరిత్ర

సృష్టించబోతున్నాం

● టీవీకే నేత విజయ్ ధీమా

● సభ్యత్వ నమోదుకు కొత్తగా యాప్ ఆవిష్కరణ

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 1967, 1977 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల తరహాలోనే 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలుండబోతున్నాయని టీవీకే అధినేత విజయ్ జోస్యం చెప్పారు. యేళ్లతరబడి రాష్ట్రాన్ని పాలించిన పార్టీలకు ఆ రెండు ఎన్నికలు గుణపాఠం చెప్పాయని, అదేవిధంగా రాబోవు ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం ఘనవిజయం సాధించి కొత్త చరిత్ర సృష్టించనుందని ఆ పార్టీ అధ్యక్షుడు, సినీనటుడు విజయ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం పనయూరులోని పార్టీ కార్యాలయంలో అట్టహాసంగా ఏర్పాటైన కార్యక్రమంలో సభ్యత్వ నమోదు కోసం 'మై టీవీకే' పేరుతో మొబైల్ యాప్‌ను ఆయన ఆవిష్కరించారు. అదే సమయంలో ఒకే కుటుంబంలో మూడు తరాలవారికి పార్టీ సభ్యత్వ కార్డులు అందజేసి, వారిని సత్కరించారు. వరుస విజయాలతో మదమెక్కిన రాజకీయ పార్టీలకు గతంలో జరిగిన రెండు ఎన్నికల్లో ఘోరపరాజయం ఎదురైందని, ఆ రీతిలోనే వచ్చే యేడాది జరిగే శాసనసభ ఎన్నికల్లో అధికారబలం కలిగిన పార్టీలు మట్టికరవటం ఖాయమని, టీవీకే ఘనవిజయం సాధించి అధికారంలోకి వస్తుందన్నారు. టీవీకే విజయం సాధించాలంటే పార్టీ శ్రేణులు ఊరూరా తిరుగుతూ, ఇంటింటికీ వెళ్ళి ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అన్నాదురై వ్యాఖ్యలే ఆదర్శం... : టీవీకే ప్రముఖులు, జిల్లా నేతలు, పార్టీ శ్రేణులు మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై గతంలో చేసిన వ్యాఖ్యలను స్ఫూర్తిగా తీసుకోవాలని విజయ్ అన్నారు. పార్టీ సభ్యత్వ కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయని పార్టీ సభ్యుల సంఖ్యను రెండు కోట్లకు పైగా పెంచడమే తన ధ్యేయమని, ఆ మేరకే కొత్త మొబైల్‌యాప్‌ను ఆవిష్కరించానని చెప్పారు. వచ్చే నెల మదురైలో మహానాడు, ఆ తర్వాత పర్యటన అంటూ తాను ఎన్నికల వరకూ ప్రజలవద్దకు వెళతానని చెప్పారు. అంతా మంచే జరుగుతుందనే భావన ప్రతి పార్టీ కార్యకర్తలోనూ స్థిరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, ఆదవ్ అర్జునా, జిల్లా శాఖ నేతలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ ఆర్.ప్రియ

ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై దృష్టి

● రోడ్ల విస్తరణకు చర్యలు ● జీసీసీ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం

అడయార్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు వీలుగా రోడ్ల విస్తరణపై దృష్టిసారించనున్నట్లు జీసీసీ మేయర్ ఆర్.ప్రియ వెల్లడించారు. బుధవారం ఆమె నేతృత్వంలో నగర పాలక సంస్థ సమావేశం జరిగింది. ఇందులో పలు అంశాలపై చర్చించారు. అలాగే, అనేక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మేయర్, డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీ ఛైర్మన్లు సమాధానమిచ్చారు. ఆ తర్వాత పలు తీర్మానాలు చేసి వాటిని ఆమోదించారు. వీటిలోని కొన్ని తీర్మానాలను పరిశీలిస్తే, స్థానిక మెరీనా బీచ్ కామరాజర్ రోడ్డు, రాధాకృష్ణన్ రోడ్లు తదితర మార్గాల్లో ట్రాఫిక్ పెరిగిపోయిందని, ఈ సమస్య పరిష్కారం కోసం రోడ్ల విస్తరణతో పాటు ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణం చేపట్టాలని తీర్మానించారు మణలి శ్మశానవాటికలో క్రైస్తవులకు, మార్వాడీలకు ఎకరం చొప్పున స్థలం కేటాయించాలని నిర్ణయించారు. నటుడు జయశంకర్ ఉన్న కాలేజీ రోడ్డుకు జయశంకర్ రోడ్డు అని పేరు పెట్టాలని తీర్మానించారు. ప్రజాసేవలో నిమగ్నమైవుండే 200 మంది కార్పొరేటర్లకు స్థానిక ఓమందూరార్ ప్రభుత్వ వైద్య కాలేజీలో మాస్టర్ హెల్త్ చెకప్‌కు అనుమతివ్వడంతో పాటు మొత్తం 117 తీర్మానాలను ఆమోదించారు.



అజిత్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఈపీఎస్

డీఎంకే పాలనలోనే

పరువు హత్యలు అధికం

● ఈపీఎస్ ధ్వజం

ప్యారీస్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతల కారణంగా ఇప్పటివరకు 20 పరువు హత్యలు జరిగాయని, ప్రజల ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయిందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. శివగంగ జిల్లాలో రెండో విడత ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ఈపీఎస్ బుధవారం ఉదయం శివగంగ జిల్లా మడపురం ఆలయ వాచ్‌మన్‌గా పనిచేస్తూ లాకప్‌డెత్‌కు గురైన అజిత్‌కుమార్ నివాసానికి వెళ్ళారు. అక్కడ అజిత్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం అజిత్‌కుమార్ తల్లి, సోదరుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ, ఏ నేరం చేయని అజిత్‌కుమార్‌ను అన్యాయంగా లాకప్‌డెత్ చేసిన పోలీసుల వైఖరిని ఖండిస్తూ అన్నాడీఎంకే తరుపున రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ధర్నాలు నిర్వహించినట్లు తెలిపారు. 2021లో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు రక్షణ కరువైందని, శాంతిభద్రలను కాపాడటంలో పోలీసుశాఖ విఫలమైందన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పాటయ్యాక అజిత్‌కుమార్ సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చిన ఈపీఎస్ ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆ తర్వాత కీళడి ప్రాంతంలోవున్న పరిశోధన కేంద్రాన్ని మాజీమంత్రులు సెల్లూరు రాజు, డాక్టర్ సి.విజయ్‌భాస్కర్, పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ 2014వ సంవత్సరం ముఖ్యమంత్రిగా వ్యవహరించిన జయలలిత కీళడి తవ్వకాలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. 2015 నుంచి 2015 వరకు పరిశోధకులు అమర్‌నాథ్ రామకృష్ణన్ మూడు విడతల పరిశోధన చేశారని, ఆ తర్వాత కేంద్రప్రభుత్వం నుంచి అనుమతి పొంది, 2018లో రాష్ట్ర పురావస్తుశాఖ నేతృత్వంలో 2019 వరకు నిర్వహించిన తవ్వకాల్లో అరుదైన పురాతన కళాకండాలు లభ్యమయ్యాయని, వాటిని అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న పరిశోధనశాలకు పంపించామని వివరించారు. అమెరికాలోని చికాగోలో నిర్వహించిన ప్రపంచ తమిళ మహానాడులో 'కీళడి ఎంతాయ్ మడి' అనే పేరిట ఏర్పాటు చేసి మొట్టమొదటి సారిగా ప్రదర్శన ఏర్పాటు చేసి కీళడి ఘనతను ప్రపంచస్థాయికి తీసుకెళ్లామన్నారు.2020వ సంవత్సరం నగరంలో జరిగిన 43 పుస్తక ప్రదర్శనలో కీళడి తవ్వకాల విశిష్టతను రాష్ట్ర ప్రజలు తెలుసుకోవాలన్న ఉద్దేశంతో ప్రత్యేకస్టాళ్లు ఏర్పాటు చేశామని, రాష్ట్రంలో నిర్వహించిన 39 పురావస్తు పరిశోధనల్లో 33 అన్నాడీఎంకే ప్రభుత్వంలో నిర్వహించినవని తెలిపారు. ప్రస్తుతం కీళడి పేరుతో కొంతమంది రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వాస్తవాలను మరుగుపరిచిన సీఎం స్టాలిన్ ప్రభుత్వం కీళడి పరిశోధనలు తమవల్లేనని ప్రకటించుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చారిత్రాత్మకమైన కీళడి పరిశోధనలకు మరింత ఘనత చేకూర్చేలా ఆ నివేదికకు కేంద్రప్రభుత్వం అంగీకరించాలని విజ్ఞప్తి చేసిన ఈపీఎస్ ఈ నాలుగేళ్ళ డీఎంకే పాలనలో అన్నిశాఖల్లో అభివృద్ధి కుంటుపడిందని వ్యాఖ్యానించారు.



కీళడి మ్యూజియం పరిశీలిస్తున్న ఎడప్పాడి

సమాచార దర్శిని

నేడు టెన్త్, ప్లస్ వన్ సప్లిమెంటరీ ఫలితాలు

పెరంబూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): టెన్త్, ప్లస్ వన్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు గురువారం విడుదల కానున్నాయి. మధ్యాహ్నం 2.30 గంటలకు www.dge.tn.gov. in అనే వెబ్‌సైట్‌లో ఫలితాలతో పాటు తాత్కాలిక మార్కుల జాబితాను విద్యార్థులు పొందవచ్చని ప్రభుత్వ పరీక్షల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఇంజనీరింగ్ ఉప కౌన్సెలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంజనీరింగ్ కళాశాలల్లో చేరేందుకు ఉప కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సాంకేతిక విద్య డైరెక్టరేట్ ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరం జనరల్ కౌన్సెలింగ్ పూర్తయిన నేపథ్యంలో, కొన్ని కళాశాలల్లో ఖాళీలున్నాయి. ఈ సీట్లకు ప్లస్ టూ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు ఆన్‌లైన్‌లో ఈ నెల 12వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ సదుపాయ లేని వారు జిల్లాల్లో ఏర్పాటుచేసిన 110 తమిళనాడు ఇంజనీరింగ్ అడ్మిషన్ల సేవా కేంద్రాల ద్వారా ఒరిజినల్ సర్టిఫికెట్లు, దరఖాస్తు రుసుముతో దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టరేట్ తెలిపింది.

‘ఉంగళుడన్ స్టాలిన్’ శిబిరాల వివరాలతో వెబ్‌సైట్

పెరంబూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కరించేలా రాష్ట్రవ్యాప్తంగా ‘ఉంగళుడన్ స్టాలిన్’ పేరుతో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. తొలి విడత శిబిరాలు ఆగస్టు 15వ తేది వరకు జరుగనున్నాయి. ఈ శిబిరాల్లో నగర ప్రాంతాల్లో 13 శాఖలకు సంబంధించి 43 సేవలు, గ్రామీణ ప్రాంతాల్లో 15 శాఖలకు సంబంధించి 46 సేవలు పొందవచ్చు. వార్డుల వారీగా నిర్వహిస్తున్న ఈ శిబిరాల వివరాలను కార్యాలయాల ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నారు. ఈ నేపథ్యంలో, మరుసటిరోజు శిబిరాలు జరిగే ప్రాంతాలను ముందుగా తెలుసుకునేలా https://ungaludanstalin. tn.gov.in/ అనే వెబ్‌సైట్ పరిచయం చేశారు. ప్రజలు ఈ వెబ్ సైట్ ద్వారా తమ ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహించే ప్రాంతాలు, తేదీలు తెలుసుకోవచ్చని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

రూ.500 కోట్లతో వంద హైలెవల్ వంతెనలు

పెరంబూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతా ల్లో రూ.500 కోట్లతో 100 హైలెవల్ వంతెనల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ఆ ప్రకారం, అరియలూరు, చెంగల్పట్టు, కోవై, కడలూరు, దిండుగల్, ఈరోడ్, కాంచీపురం, కరూర్, కృష్ణగిరి, మదురై, మైలాడుదురై, నాగపట్టణం, వేలూరు, విరుదునగర్, నామక్కల్, పెరంబలూరు, తిరుచ్చి, తిరుపత్తూర్, తిరువళ్లూర్, తిరువణ్ణామలై సహా 28 జిల్లాల్లో హైలెవల్ వంతెనలు నిర్మించనున్నారు. ‘మీ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి’ పథకంలో శాసనసభలో ఎమ్మెల్యేల కోరిక పరిశీలించిన ప్రభుత్వం, ప్రాధాన్యత ఆధారంగా వంద ప్రాంతాల్లో వంతెనలు ఏర్పాటుకు గ్రామీణాభివృద్ధి శాఖ టెండర్లు ఆహ్వానించింది.

అముద ఫెస్టివల్ పార్క్ అభివృద్ధికి రూ.2.40 కోట్లు

పెరంబూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ మండలంలోని అముద ఫెస్టివల్ పార్క్ ప్రహరీ, అభివృద్ధి పనులకు రూ.2.40 కోట్లు కేటాయించారు. అడయార్ మండలం 173వ వార్డు ఓఎంఆర్ మధ్య కైలాష్ రైల్వేస్టేషన్ నుంచి ఇందిరా నగర్ రైల్వే స్టేషన్ వరకు ఉన్న ఖాళీ స్థలంలో అముద ఫెస్టివల్ పార్క్ ఏర్పాటుచేశారు. పార్క్ చుట్టుపక్కల ఏర్పాటుచేసిన కంచెలు సురక్షితం కాకపోవడంతో, వాటిని తొలగించి ప్రహరీ గోడ, ఇతర అభివృద్ధి పనులకు రూ.2.40 కోట్లు కేటాయించినట్లు, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు చెన్నై కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

కార్పొరేషన్ పాఠశాలల్లో మూడింతల అడ్మిషన్లు

పెరంబూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు మూడు రెట్లు పెరిగాయి. జీసీసీ పరిధిలో ప్రాథమిక, ఉన్నత, మహోన్నత 417 పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 22,870 మంది విద్యార్థులు కొత్తగా చేరారు.. గత ఏడాది అడ్మిషన్లు 6,000 జరిగాయి.. విద్యార్థుల సంఖ్యకు తగినట్లు, అదనపు తరగతి గదులు, మౌలిక వసతులు ఏర్పాటుచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఆడిపెరుక్కు, వారాంతపు సెలవులకు 1090 ప్రత్యేక బస్సులు

టి.నగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆడిపెరుక్కు, వారాంతపు సెలవులను పురస్కరించుకుని ఆగస్టు ఒకటి నుంచి నగరంలోని మూడు ప్రధాన బస్‌స్టేషన్ల నుండి 1090 ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ ఎండీ ఆర్.మోహన్ తెలిపారు. కిలాంబాక్కం బస్‌స్టేషన్ నుండి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోవిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూరు, సేలం, ఈరోడ్, తిరుప్పూరు నగరాలకు ఆగస్టు ఒకటిన 340 బస్సులు, 2న 350 బస్సులు నడుపుతామని తెలిపారు. ఇదే విధంగా కోయంబేడు బస్‌స్టేషన్ నుండి తిరువణ్ణామలై, నాగపట్టినం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు నగరాలకు ఆగస్టు ఒకటిన 55 బస్సులు, 2తేదీ 55 బస్సులు నడుపనున్నట్లు తెలిపారు. అలాగే బెంగళూరు, తిరుప్పూరు, ఈరోడ్, కోవై నగరాల నుంచి ఇతర ప్రాంతాలకు 250 ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. మాధవరం బస్‌స్టేషన్ నుండి ఆగస్టు ఒకటిన 20 బస్సులు, 2తేదీన 20 బస్సులు నడుపుతామని చెప్పారు. అంతేకాకుండా ఆదివారం సొంతూళ్ల నుండి చెన్నై, బెంగళూరు తదితర నగరాలకు తిరిగివచ్చేందుకు వీలుగా మరికొన్ని ప్రత్యేక బస్సులు నడుపుతామని ఆయన పేర్కొన్నారు.

ఆదాయ వృద్ధి లక్ష్యంగా కొత్త పథకం

ప్యారీస్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆదాయ వృద్ధి పెంచుకోవడానికి యాక్టివ్ మొమెంటం ఫండ్ పథకాన్ని ప్రారంభించినట్లు కోటక్ మహేంద్ర అసెట్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎండీ నీలేషా పేర్కొన్నారు. ఆయన కొత్త ఫండ్ పథకం గురించి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో, ఇన్ హౌస్ యాజమాన్య నమూనాపై రూపొందించిన ఆదాయ వృద్ధి లక్ష్యాలను సంగ్రహించడమే లక్ష్యంగా యాక్టివ్ మొమెంటం పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకం కోసం పబ్లిక్ సబ్‌స్క్రిప్షన్ మంగళవారం (29వ తేదీ)నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కొత్త పథకం సాధారణ నమ్మకంపై నిర్మించబడిందని, ఆదాయాల ద్వారా నడిచే నిధి సృష్టించడానికి, పెట్టుబడి వ్యూహాన్ని డేటా సైన్స్‌తో అనుసంధానం చేసినట్లు ఫండ్స్ విభాగం మేనేజర్ రోహిత్ టాండన్ తెలిపారు.

మదురైలో టీవీకే మహానాడుకు భారీ ఏర్పాట్లు

టి.నగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మదురైలో ఆగస్టు 25న జరుగనున్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) ద్వితీయ మహానాడు ఏర్పాట్లను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ తదితరులు పరిశీలించారు. మదురై పోలీసు కమిషనర్ అరవింద్‌ను కలుసుకుని ఆ మహానాడు నిర్వహణకు వీలైనంత త్వరగా అనుమతివ్వాలని వినతిపత్రం కూడా సమర్పించారు. మదురై నగరానికి చేరువగా మదురై - తూత్తుకుడి రహదారిలో 506 ఎకరాల స్థలాన్ని మహానాడు కోసం ఎంపిక చేసినట్లు బుస్సీ ఆనంద్ తెలిపారు. ఇప్పటికే మహానాడు వేదిక, పందిరి, పార్కింగ్ గ్యాలరీల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. ఇదిలా ఉండగా ఆగస్టు 27 వినాయకచవితికి ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టాల్సి ఉండటంతో మహానాడు ేదీని ఆగస్టు 25న కాకుండా వినాయకచవితి తర్వాత అనువైన తేదీలో జరుపుకోవాలని పోలీసు అధికారులు చేసిన సూచనను టీవీకే నేతలు తోసిపుచ్చారు.


మహానాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న బుస్సీఆనంద్, ఆదవ్ అర్జునా తదితరులు

● లాకప్ డెత్ వ్యవహారం...

అందరూ నన్నే తప్పుబట్టడం న్యాయమా?

● ప్రొఫెసర్ నిఖిత ఆగ్రహం

టి.నగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుండి కాయగూరలు కొనటానికి, కారుకు పెట్రోలు వేయడానికి వెళ్లలేకపోతున్నానని, అందరూ తనను మాత్రమే తప్పుబట్టేలా ప్రవర్తిస్తున్నారని ప్రొఫెసర్ నిఖితా ఆరోపించారు. అజిత్‌కుమార్ లాకప్ డెత్ కేసుపై దర్యాప్తు జరుపుతున్న సీబీఐ అధికారులు నిఖిత, ఆమె తల్లి శివకామిని రెండోసారి విచారణ జరిపారు. విచారణ అనంతరం నిఖిత మీడియాతో మాట్లాడుతూ ఆలయ వాచ్‌మన్ అజిత్‌కుమార్‌పై తాను ఫిర్యాదు మాత్రమే చేశానని, ఆ తర్వాత ఏం జరిగిందో తనకు తెలియదన్నారు. పోలీస్ కస్టడీలో అజిత్‌కుమార్ మృతి చెందినట్లు తెలుసుకుని బాధపడ్డానని, అందరూ ఏకపక్షంగా తననే తప్పుబడుతుండగా ఇంటి నుండి బయటకెళ్ళి కాయగూరలు కొనేందుకు, పెట్రోలు వేసుకునేందుకు కూడా వెళ్లలేకపోతున్నానని, నిఖిత ఆందోళన వ్యక్తం చేశారు.


సీబీఐ విచారణ తర్వాత తల్లితోపాటు బయటకు వస్తున్న ప్రొఫెసర్ నిఖిత

కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యం

ప్యారీస్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఉన్న పబ్లిక్ టాయిలెట్లను శుభ్రం చేసేందుకు రూ.1000 కోట్లకు పైగా ఖర్చు చేసినా ఫలితం కనిపించలేదు. ప్రజలు వినియోగించుకోలేని విధంగా దుర్వాసన వస్తున్నాయని నగరవాసులు వాపోతున్నారు. టాయిలెట్ల శుభ్రతకు రూ.1000 కోట్లు ఖర్చుచేసినా మళ్లీ వాటి కోసం రూ.1000 కోట్లు వెచ్చించనున్నట్లు జీసీసీ ప్రకటించడాన్ని ఏఐటీయూసీ, అన్నాడీఎంకే తదితర కార్మిక సంఘాలు తప్పుబడుతున్నాయి. నగరంలోని 15 జోన్లలో ఉన్న 200 వార్డుల్లో 1,260 ప్రాంతాల్లో 10వేలకు పైగా పబ్లిక్ టాయిలెట్లున్నాయి. వీటిని శుభ్రపరిచేందుకు గత ఐదేళ్లలో స్వచ్ఛ భారత్ పథకం కింద జీసీసీ రూ.620 కోట్లు ఖర్చు చేసింది. రాయపురం, తిరువీకానగర్ జోన్లలోని టాయిలెట్లను 9యేళ్ల ప్రైవేటు పరంచేసేందుకు రూ.420 కోట్లు ఖర్చుచేసింది. ఇది కాకుండా మొబైల్ టాయిలెట్లు, కొత్త టాయిలెట్ల నిర్మాణానికి సుమారు రూ.50 కోట్లు వెచ్చించింది. ఈ రకంగా వెయ్యికోట్లు కేవలం టాయిలెట్ల శుభ్రత కోసం ఖర్చుచేసినా.. కార్పొరేషన్ పరిధిలోఉన్న టాయిలెట్ల పరిస్థితి మాత్రం మారలేదని, ప్రజాధనాన్ని ఈ రకంగా వృధా చేయడం సబబేనని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు.


నగర కార్పొరేషన్ పబ్లిక్ టాయిలెట్లు

‘పరువు హత్యలపై’ ప్రత్యేక చట్టం

● టీఎన్‌సీసీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు రంజన్‌కుమార్

ప్యారీస్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరువు హత్యలను అడ్డుకునేలా ప్రత్యేక చట్టం ప్రవేశపెట్టాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ఎస్సీ విభాగం అధ్యక్షుడు రంజన్ కుమార్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల తిరునల్వేలిలో జరిగిన పరువు హత్య రాష్ట్రంలో కలకలంరేపింది. మృతుడు కవిన్ దళిత వర్గానికి చెందిన వాడు కావడంతో అతని కుటుంబానికి న్యాయం చేయాలని, పలు దళిత సంఘాలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాయి. ఈ నేపథ్యంలో, రంజన్‌కుమార్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో వేలసంఖ్యలో కులాంతర వివాహాలు జరిగాయని, అయినప్పటికీ ఇటీవల కాలంలో ఈ వివాహాలు చేసుకుంటున్న దళితులను హతమారుస్తున్న సంస్కృతి పెరుగుత్తోందని, దీనిని అడ్డుకునేలా డీఎంకే ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



రేపటితో చేపల వేట నిషేధ కాలం ముగింపు

● సిద్ధమవుతున్న జాలర్లు

వాషర్‌మెన్‌పేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చేపల వేటపై విధించిన నిషేధకాలం గురువారంతో ముగియనుండడంతో, శుక్రవారం నుంచి చేపల వేటకు సముద్రంలోకి వెళ్లేందుకు కన్నియాకుమారి జిల్లా మత్స్యకారులు సిద్ధమవుతున్నారు. చేపల సంతానోత్పత్తి కాలంలో మోటారు పడవల ద్వారా చేపలు పట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 60 రోజులు నిషేధం విధించింది. కన్నియాకుమారి జిల్లాలో రెండు విడతలుగా నిషేధకాలం అమలులో ఉంటుంది. కన్నియాకుమారి తూర్పు తీరంలోని చిన్నముట్టం ప్రాంతంలో ప్రతి ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు, పశ్చిమ తీరంలోని మనక్కుడి, రాజక్క మంగళం, ముట్టం, కుళచ్చల్, తెంగాపట్టణం, కొల్లంగోడు, నీరోడి తీర ప్రాంత గ్రామాల్లో జూన్ 1 నుంచి జూలై 31వ తేది వరకు నిషేధం ఉంటుంది. ఆ ప్రకారం, పశ్చిమ తీరంలో చేపల వేటకు విధించిన నిషేధం గురువారంతో ముగియనుంది. దీంతో, శుక్రవారం నుంచి చేపల వేటకు వెళ్లేందుకు జాలర్లు సిద్ధమవుతున్నారు. రెండు నుంచి వారం రోజులు సముద్రంలో చేపల వేట సాగించేందుకు అవసరమైన ఆహారం, నీరు, చేపలు ఉంచేందుకు ఐస్ తదితరాలు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

● బాలికపై అత్యాచారం కేసు..

ఘటనా స్థలంలో నిందితుడి విచారణ

ప్యారీస్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపం ఆరంబాక్కం వద్ద బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో అరెస్టయిన ఒడిశా రాష్ట్రానికి చెందిన రాజుబిశ్వవర్మ (35)ను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు బుధవారం అత్యాచారం జరిగిన మామిడి తోటకు తీసుకెళ్ళి విచారణ జరిపారు. ఈ నెల 12న ఒంటరిగా నడచి వెళుతున్న బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉత్తరాదికి చెందిన రాజుబిశ్వవర్మ అనే యువకుడిని ఈ నెల 25న సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిందితుడిని కోర్టు ఉత్తర్వుల మేరకు విచారణ నిమిత్తం నాలుగు రోజుల పాటు తమ కస్టడీలోకి తీసుకున్న పోలీసులు బుధవారం ఆరంబాక్కం ప్రాంతంలో అత్యాచారానికి పాల్పడిన మామిడి తోటకు తీసుకెళ్ళి వాఙ్మూలం రికార్డు చేశారు. కాగా ఆరంబాక్కం ప్రాంత వాసులు కామాంధుడిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

ఇంజనీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్

● 80,600 మందికి తాత్కాలిక కేటాయింపులు

పెరంబూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలకు కౌన్సెలింగ్ జరుగుతోంది. మూడు విడతల్లో నిర్వహించే ఈ కౌన్సెలింగ్‌లో తొలివిడత ఈ నెల 14 నుంచి 26వ తేది వరకు నిర్వహించగా, 41,807 మంది విద్యార్థులు హాజరుకాగా, 20,896 సీట్లు భర్తీ అయ్యాయి. రెండవ విడత కౌన్సెలింగ్ ఈ నెల 26న ప్రారంభం కాగా, జనరల్ విభాగం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కేటాయించిన 7.5 సీట్లకు 98,575 మందికి కాల్ లెటర్స్ పంపించారు. విద్యార్థులు తమకు నచ్చిన కళాశాల ఎంపికకు 28వ తేది వరకు అవకాశం కల్పించారు. జనరల్ విభాగంలో 70,116 మంది, 7.5 శాతం రిజర్వేషన్ కోటాలో 10,534 మందికి సీట్లు కేటాయించారు. సీటు నిర్ధారణ చేసుకున్న విద్యార్థులు ఈ నెల 31 నుంచి ఆగస్టు 4వ తేదిలోపు ఆయా కళాశాలల్లో చేరాల్సి ఉంది. ఇతర కళాశాలలకు మారాలనే విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు అనుమతించారు. ఆగస్టు 7వ తేది తుది కేటాయింపు ఉత్తర్వులు అందజేయనున్నట్లు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల అడ్మిషన్ కౌన్సిల్ ఒక ప్రకటనలో తెలిపింది.

విద్యా నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్

● సుప్రీంకోర్టులో రేపు విచారణ

పెరంబూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు విద్యా నిధులు అందించేలా కేంద్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేయాలనే పిటిషన్ ఆగస్టు 1వ తేది సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. తమిళనాడుకు 2024-25 సంవత్సరానికి సమగ్ర శిక్షా అభియాన్ నిధులు 2,152 కోట్లు, నిర్బంధ విద్యా నిధులు రూ.617 కోట్లు, ఈ ఏడాది మొదటి విడత నిధులు అందించాలని కోరుతూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ వినతిపత్రం సమర్పించారు. ఈ క్రమంలో, రాష్ట్రానికి విద్యా నిధులు అందించేలా కేంద్ర ప్రభుత్వానికి ఆదేశించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. పిటిషన్‌లో... విద్యా నిధులు నిలిపివేయడంతో, 48 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ పిటిషన్ ఆగస్టు 1వ తేది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పీఆర్ కవాయ్, న్యాయమూర్తి వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం విచారించనుంది.

డీఎంకేతోనే రాష్ట్రాభివృద్ధి


ఇంటింటి ప్రచారంలో డీఎంకే శ్రేణులు

తిరుత్తణి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి 42వ వార్డులోని 173వ బూత్ పరిధిలో బుధవారం ఉదయం డివిజన్ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తిరుత్తణి మండల కార్యదర్శి ఆనంద్‌రాజ్ నేతృత్వంలో జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో డీఎంకే ప్రభుత్వానికి మద్దతుగా ‘మీతో స్టాలిన్’ అనే స్టిక్కర్లను ఇంటింటికి అంటించి, కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల డీఎంకే శ్రేణులు ప్రకాశ్, తంగరాజ్, వేల్‌మణి, రామకృష్ణన్, లింగరాజ్, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

కోవలం తీరంలో చెట్ల పెంపకం

ప్యారీస్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా కోవలం సముద్రతీరంలో చెట్లను పెంచనున్నారు. తమిళనాడు అటవీశాఖ, ఓషన్ సొసైటీ ఆఫ్ ఇండియా, నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్, మాంగ్రూవ్ ఫౌండేషన్, 4 ఐయాఫ్స్ సొల్యూషన్ల సహకారంతో ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నిర్వహణలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చెట్ల పెంపకానికి శ్రీకారం చుట్టారు. అటవీ దినోత్సవ-2025 కార్యక్రమంలో భాగంగా కోవలం తీరం మాంగ్రూవ్ (మడ అడవులు)మొక్కలను విరివిగా నాటి సంరక్షించేలా చర్యలు చేపట్టినట్లు ఎన్‌సీసీఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎస్ కంకర, ఫారెస్ట్ కోస్టల్ సెక్యూరిటీ అధికారి పొన్ సెంథిల్, వోఎస్ఐ చెన్నై చాప్టర్ ప్రతినిధులు డాక్టర్ ట్యాన్ ఉషా, జోషియా జోసఫ్, తిరుమురుగన్ ఓ ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి కుట్రాలంలో స్నానాలకు అనుమతి

వాషర్‌మెన్‌పేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా కుట్రాలం జలపాతంలో గురువారం నుంచి పర్యాటకుల స్నానాలకు అనుమతిస్తున్నట్లు జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది. కుట్రాలం జలపాతం వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా జలపాతంలో స్నానాలకు మూడు రోజుల క్రితం నిషేధం విధించారు. ప్రస్తుతం నీటి ప్రవాహం తగ్గడంతో గురువారం నుంచి కుట్రాలం జలపాతంలో పర్యాటకుల స్నానాలకు అనుమతిస్తున్నట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తాంబరం: ఏఎల్ఎస్ నగర్, రమణ నగర్, ఆదంబాక్కం మెయిన్ రోడ్డు, నార్త్, ఈస్ట్, వెస్ట్ మాతా వీధులు, మాణిక్యం అవెన్యూ, పద్మావతి నగర్, అగరం మెయిన్ రోడ్డు, వేదాచలం నగర్, ఎస్ఆర్ కాలని, ఐఏఎఫ్ రోడ్డు, రిక్కీ గార్డన్, హరిణి అపార్ట్‌మెంట్, సుమేరు సిటీ, రంగా నగర్, సరంగాసి నగర్, తిరువణ్ణామలై నగర్, కామరాజ్ హైవే, పేట వీధి, కన్నగి వీధి, పంచాయతి బోర్డు వీధి, చక్రా అవెన్యూ.

పల్లావరం: తిరువల్లం పెరియార్ నగర్, అమ్మన్ నగర్, అరుళ్‌మాలై చావిడి, అన్నై అంజుగం, శక్తి నగర్, పల్లావరం ఈస్ట్ ఏరియా, తిరువల్లం, వెంకట్రామన్ నగర్, శివగామి నగర్, ముత్తమిళ్ నగర్, గాయత్రి నగర్, కృష్ణా నగర్, భువనేశ్వరి నగర్, పాసియం నగర్, మాణిక్యం నగర్, పీబీఆర్ నగర్.

అడయార్: బీసెంట్ నగర్, రుక్మిణి రోడ్డు, బీచ్ రోడ్డు, అరుండాల్ బీచ్ రోడ్డు, 7వ అవెన్యూ, 30వ క్రాస్ వీధి, ఎంజీఆర్ వీధి, టైగర్ వరదాచారి రోడ్డు.

గాంధీ నగర్: క్రీసెంట్ అవెన్యూ రోడ్డు, క్రీసెంట్ పార్క్, 1,2వ రోడ్లు, గాంధీ నగర్ 3వ క్రాస్ వీధి మరియు 4వ మెయిన్ రోడ్డు, శాస్త్రి నగర్ మాల్వియా అవెన్యూ, సుబ్బు వీధి, ఎంజీ రోడ్డు, మరుదీశ్వరర్ నగర్, ఎల్బీ రోడ్డు, కెనాల్ బ్యాంక్ రోడ్డు, కేపీ నగర్ 1 నుంచి 3వ మెయిన్ రోడ్లు, కేపీ నగర్ 2,3 క్రాస్ వీధులు, పీవీ నగర్ 1,2 వీధులు, అన్నా అవెన్యూ ఏరియా, గోవిందరాజపురం, సర్దార్ పాటిల్ రోడ్డు, భక్తవత్సలం 1వ వీధి.

వేళచ్చేరి: వేళచ్చేరి మెయిన్ రోడ్డు, మాటియో వీధి, ఒరాండి అమ్మన్ ఆలయ వీధి, జగన్నాధపురం, రామ్స్ అండ్ సీబ్రోస్ అపార్ట్‌మెంట్.

వ్యాసర్పాడి: ఎరుకంజేరి హైవే, పీవీ కాలనీ, శాస్త్రి నగర్, ఇందిరా నగర్ ఎక్స్‌టెన్షన్, వ్యాసర్పాడి ఇండస్ట్రియల్ ఎస్టేట్, గాంధీ నగర్, స్టీఫెన్ రోడ్డు, వ్యాసర్ నగర్, గాంధీ నగర్, పుదు నగర్, ఎంబీఎం నగర్, వ్యాసర్పాడి మార్కెట్, సెంట్రల్ క్రాస్ వీధి, ఏబీసీ కల్యాణపురం, సత్యమూర్తి 22వ వీధి గార్డన్, పల్లాత్ వీధి 1 నుంచి 3 వీధులు, ఉదయసూర్యన్ నగర్, ఎస్ఏ కాలని, శర్మ నగర్.

ఆవడి: పట్టాభిరాం, సేక్కాడు, అయ్యప్పన్ నగర్, శ్రీదేవి నగర్, తాండురై, కన్నపాళయం, గోపాలపురం, వీజీవీ నగర్, వీజీఎన్ నగర్.

ఆర్టీవో కార్యాలయంలో రూ.1.06 లక్షల స్వాధీనం

పెరంబూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి ప్రతీయార్‌లో ఉన్న ఆర్టీఓ కార్యాలయంలో ఏసీబీ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టి లెక్కల్లో చూపని రూ.1.06 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యాలయం ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ సహా పలు సేవలకు నేరుగా, ఏజెంట్ల ద్వారా లంచం కోరుతున్నట్లు ఏసీబీకి ఫిర్యాదులందాయి. వాటి ఆధారంగా ఏసీబీ డీఎస్పీ మణికంఠన్ నేతృత్వంలో సిబ్బంది మంగళవారం మధ్యాహ్నం కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కార్యాలయ తలుపులు, కిటికీలు మూసివేసిన అధికారులు, కిటికీలను టార్పాలిన్‌తో మూసివేశారు. కార్యాలయంలో ఉన్న ఇద్దరు ఏజెంట్ల నుంచి రూ.56వేలు, ఆర్టీఓ నటరాజన్ కారులో తనిఖీలు చేసి రూ.50వేలు స్వాధీనం చేసుకున్నారు. రాత్రి 8.30 గంటల వరకు జరిగిన తనిఖీల్లో ఆర్టీఓ నటరాజన్, ఎంవీఐ విమల, ఏజెంట్లు సేతురాజ్, రమేష్ తదితరులను విచారించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

పరువుహత్య కేసులో నిందితుడు సుర్జిత్‌పై గూండాచట్టం


సుర్జిత్

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పాళయంకోటలో ఐటీ ఉద్యోగి కవిన్ సెల్వ గణేష్ పరువు హత్యకేసులో నిందితుడు సుర్జిత్‌పై గూండాచట్టం ప్రయోగిస్తూ తిరునల్వేలి నగర పోలీసు కమిషనర్ సంతోష్ హదిమణి ఆదేశాలు జారీ చేశారు. ఈ పరువు హత్యకేసులో నిందితుడి తల్లిదండ్రులైన ఎస్ఐలు శరవణన్, కృష్ణకుమారికి సంబంధమున్నట్లు నిర్ధారణ కావటంలో వారిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ నేపథ్యంలో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సుర్జిత్‌ను తమ కస్టడీలోకి తీసుకుని విచారణ జరిపేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇక పోలీసుల విచారణ సందర్భంగా కవిన్ కుటుంబీకులు కొన్ని ఫొటోలను అందజేశారు. వాటిలో కవిన్, సుర్జిత్ సోదరి కలిసి తిరుగుతున్న ఫొటోలు ఎక్కువగా ఉన్నాయి. సుర్జిత్ సోదరిని కవిన్ ఎన్నో ఏళ్లుగా ప్రేమిస్తున్నట్లు కుటుంబీకులు పోలీసులకు తెలిపారు.

వ్యభిచారం కేసులో ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసర్పాడిలో వ్యభిచారం సాగిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వ్యాసర్పాడి వ్యభిచార నిరోధక విభాగం పోలీసులకు అందిన సమాచారంతో, మంగళవారం ఎంకేబీ నగర్ సత్యమూర్తి నగర్ మెయిన్ రోడ్డులోని ఓ ఇంట్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వ్యభిచారం జరుగుతున్నట్లు నిర్ధారించారు. ఈ వ్యవహారంలో రాజస్థాన్‌కు చెందిన అశోక్‌కుమార్, జబ్బార్‌పూర్తి, ముంబైకి చెందిన మోహన్ తదతరులను అరెస్ట్ చేసి, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ముగ్గురు మహిళలను ప్రభుత్వ హోంకు తరలించినట్లు నగర పోలీసు శాఖ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

పర్యాటకుడి కారు తాళాలు ఎత్తుకెళ్లిన వానరం

● సమయస్ఫూర్తిగా తీసుకున్న పోలీసు

పెరంబూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పర్యాటకడి కారు తాళాలు తీసుకెళ్లిన వానరం నుంచి ఓ పోలీసు సమయస్ఫూర్తిగా వ్యవహరించి తాళాలు తిరిగి పొందాడు. తెన్‌కాశి జిల్లా కుట్రాలం జలపాతాలకు ప్రతిరోజు పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. పర్యాటకుల బ్యాగుల, పండ్లను ఆ ప్రాంతంలో తిరిగే వానరాలు ఎత్తుకెళుతుంటాయి. ఈ నేపథ్యంలో, మంగళవారం ప్రధాన జలపాతంలో స్నానం చేస్తున్న ఓ పర్యాటకుడి చేతిలో కారు తాళాలను ఓ వానరం ఎత్తుకెళ్లి, ఓ బండరాయిపై కూర్చుంది. పర్యాటకులు ఈ విషయాన్ని అక్కడ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ బాలమురుగన్‌కు తెలిపాడు. వెంటనే ఆయన వానరానికి ఇష్టమైన పైనాపిల్, జామ సహా పలు రకాల పండ్లు తీసుకుని, వానరం కూర్చున్న బండరాయి సమీపంలోకి వెళ్లాడు. బాలమురుగన్ పైనాపిల్‌ను వానరానికి అందించగా, ఆ వానరం కారు తాళాలు కాలి వేలికి తగిలించుకుని పండు ఆరగించింది. అలా, పండ్లు ఇస్తున్న బాలమురుగన్ కు కారు తాళం ఇచ్చి వానరం వెళ్లిపోయింది. ఇదంతా పర్యాటకులు ఆశ్చర్యంగా చూస్తూ, వానరం తాళాలు అందించిన సమయంలో హర్షధ్వానాలు చేశారు.

అంబులెన్స్‌ను ఢీకొన్న బస్సు : ఒకరి మృతి

పెరంబూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అంబులెన్స్‌ను ప్రభుత్వ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. నాగర్‌కోయిల్‌కు చెందిన బాల్‌రాజ్ అనే వృద్ధుడు అనారోగ్యానికి గురవడంతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. ఆ సమయంలో, వడచేరి నుంచి వేగంగా వచ్చిన ప్రభుత్వ బస్సు అంబులెన్స్‌ను ఢీకొనడంతో బాల్‌రాజ్ మృతి చెందగా, ఇద్దరు అంబులెన్స్ సిబ్బందికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నమిలే పొగాకు ఉత్పత్తులు వినియోగిస్తే జరిమానా : సీఎంఆర్ఎల్

పెరంబూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైళ్లు, రైల్వేస్టేషన్లలో నమిలే పొగాకు ఉత్పత్తులు వినియోగిస్తే జరిమానా విధిస్తామని సీఎంఆర్ఎల్ హెచ్చరించింది. ఈ మేరకు చెన్నై మెట్రోరైలు లిమిటెడ్ విడుదల చేసిన ప్రకటనలో... పొగాకు ఉత్పత్తులు నమిలి ఉమ్మి వేయడంతో రైల్వేస్టేషన్, రైళ్లు అపరిశుభ్రంగా తయారవుతున్నాయని, దీనిని నిరోధించేందుకు నమిలే పొగాకు ఉత్పత్తులు వినియోగిస్తే జరిమానా విధించనున్నట్లు తెలిపింది. మెటల్ డిటెక్టర్ల ద్వారా వాటిని గుర్తించలేనందున అన్ని మెట్రో రైల్వేస్టేషన్లలో భౌతిక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపింది. కోయంబేడులో ఉన్న సెంట్రల్ సెక్యూరిటీ మానిటరింగ్ రూమ్ నుంచి నిశితంగా పరిశీలించి, భద్రతా సిబ్బందికి వెంటనే సమాచారం అందించాలని ఆదేశించినట్లు సీఎంఆర్ఎల్ తెలిపింది.

పెరుంగుడి రైల్వేస్టేషన్‌లో చైన్ స్నాచింగ్

● యువకుడి అరెస్టు


సీసీ ఫుటేజీలో మహిళ మెడలో చైను లాగుతున్న దృశ్యం

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరుంగుడి రైల్వేస్టేషన్‌లో ఓ ప్రయాణికురాలి మెడలోని గొలుసును చోరీ చేసుకెళ్ళిన యువకుడిని రైల్వేపోలీసులు అరగంటలోనే అరెస్టు చేశారు. ఆ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌లో బల్లపై రైలు కోసం వేచి చూస్తూ కూర్చున్న మహిళ పక్కనే ఓ యువకుడు ప్రయాణికుడిలా కూర్చున్నాడు. కాసేపయ్యాక ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కుని పరుగులు తీశాడు. దానికి సంబంధించి సీసీ ఫుటేజీ ఆధారంగా రైల్వే పోలీసులు గాలించి చోరీకి పాల్పడిన విల్లుపురం జిల్లాకు చెందిన బాబాజీ అలియాస్ సౌందర్ (28) అనే యువకుడిని అరెస్టు చేశారు. అతడిపై ఇదివరకే మరైమలర్‌నగర్ తదితర పోలీసుస్టేషన్లలో సెల్‌ఫోన్ల చోరీ సహా పలు చోరీ కేసులున్నట్లు రైల్వే పోలీసుల విచారణలో వెల్లడైంది.

500 ఎకరాల్లో బుగ్గిపాలైన అరటి తోట


అగ్నిప్రమాదంలో కాలిన అరటి తోట

ప్యారీస్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్, కాయామొళి, మేల్ తిరుచెందూర్ పంచాయతీ పరిధిలోని సుమారు 500 ఎకరాల్లో అరటితోటలు అగ్నికి ఆహుతయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం సుమారు 2 గంటలకు దళవాయిపురం కాయామొళి రోడ్డు పక్కన ఉన్న టెంకాయ చెట్లను హై ఓల్టేజీ విద్యుత్ తీగలు తగలడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. దీనిపై స్థానికులు అందజేసిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని రాత్రి 11 గంటల వరకు శ్రమించి మంటలను అదుపు చేశారు. కానీ అప్పటికే 500 ఎకరాల విస్తీర్ణంలో కాపు దశలో ఉన్న అరటి తోటలు మంటల్లో కాలిపోయాయి. ఈ ప్రాంతాన్ని బుధవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి తిరుచెందూర్ తహసీల్దార్ బాలసుందరం పరిశీలించారు. పంట నష్టం వివరాలను సేకరించి నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. ఇదిలా ఉండగా, తమను ప్రభుత్వం తరుపున ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.



'హౌస్‌మేట్స్' దర్శన్ - హర్ష బైజు

రేపు 8 సినిమాలు రిలీజ్

ఆగస్టులో మొదటి శుక్రవారం ఏకంగా ఎనిమిది చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. అయితే, చివరి నిమిషంలో ఎన్ని చిత్రాలు రిలీజ్ కాకుండా ఆగిపోతాయో వేచి చూడాల్సిందే. ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించిన వివరాల మేరకు ఆగస్టు ఒకటో తేదీ 'అక్యూస్డ్', 'బోగి', 'బ్లాక్‌మెయిల్', 'హౌస్‌మేట్స్', 'మిస్టర్ జూ కీపర్', 'చెన్నై ఫైల్స్ ముదల్ పక్కం', 'సరెండర్', 'ఉసురే' వంటి చిత్రాలున్నాయి. దీంతో ఒక్కో చిత్రానికి గరిష్ఠంగా వంద థియేటర్లు చొప్పున కేటాయిస్తే మొత్తంగా 800 థియేటర్లు కావాల్సి ఉంటుంది. కానీ, వీటిలో పెద్ద హీరోలు నటించిన లేదా భారీ బడ్జెట్ చిత్రాలేవీ లేకపోవడంతో ఈ సినిమాలకు థియేటర్ల కేటాయింపు పెద్ద సమస్య కాదని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలావుంటే, ఈ యేడాది జూలై 30వ తేదీ వరకు సుమారుగా 150 చిత్రాల వరకు విడుదలయ్యాయని కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆ లెక్కన చూస్తే 2025 సంవత్సరాంతానికి అంటే వచ్చే ఐదు నెలల్లో మరో వంద చిత్రాలు విడుదలైతే మొత్తంగా 250 చిత్రాలు రిలీజ్ కావొచ్చని అంచనా వేస్తున్నారు. వాస్తవానికి థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. కానీ థియేటర్లలో రిలీజ్ అయ్యే సినిమాల సంఖ్య మాత్రం తగ్గకపోవడం గమనార్హం.

కోలీవుడ్‌లో వీకెండ్ పార్టీలు ఎక్కడ?

సాధారణంగా చిత్రపరిశ్రమ అంటేనే వీకెండ్ పార్టీలు, లగ్జరీ లైఫ్. నటీనటుల స్థాయికి తగిన విధంగా వారాంతపు పార్టీల్లో మునిగితేలుతుంటారు. అయితే, గత కొంతకాలంగా ఈ తరహా పార్టీలు పెద్దగా జరగడం లేదు. దీనికి కారణం.. చిత్రపరిశ్రమకు చెందిన పలువురు సెలెబ్రిటీలు 'మత్తు' (డ్రగ్స్) కేసుల్లో చిక్కుకోవడమే. దీంతో వీకెండ్ పార్టీలు అరకొరగా జరిగినప్పటికీ వాటిలో పాల్గొనేందుకు నటీనటులు, జూనియర్ ఆర్టిస్టులు వెనుకంజ వేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ప్రముఖ దర్శకుడు అమీర్, హీరో శ్రీరామ్ (శ్రీకాంత్), నటుడు కృష్ణ మాదకద్రవ్యాల కేసుల్లో విచారణ ఎదుర్కొన్నారు. వారిలో అమీర్ మినహా మిగిలిన ఇద్దరు నటులు డ్రగ్స్ కేసులో అరెస్టయి బెయిల్‌పై విడుదలయ్యారు. అయితే, అమీర్ హీరోగా నటిస్తున్న చిత్ర నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. హీరో శ్రీకాంత్ చాలాకాలం తర్వాత జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటించిన 'బ్లాక్‌మెయిల్' చిత్రంలో ముఖ్య పాత్ర పోషించారు. ఆగస్టు ఒకటో తేదీ విడుదలకానున్న ఈ చిత్ర ప్రమోషన్ కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. దానికి శ్రీకాంత్ పాల్గొనలేని పరిస్థితి. మీడియా ముందుకు వస్తే ఎక్కడ డ్రగ్స్ కేసుపై ప్రశ్నిస్తారనే భయంతో ఇంటికే పరిమితమయ్యారు. అదేవిధంగా నటుడు కృష్ణ కూడా. 'కళగు' అనే వెబ్‌సిరీస్ ద్వారా ఒక్కసారిగా గుర్తింపు తెచ్చుకుని, ఇపుడు తన కెరీర్‌నే ప్రశ్నార్థకంగా మార్చుకున్నారు. పైగా, వీరితో మాట్లాడేందుకు కూడా నటీనటులు, స్నేహితులు జంకుతున్నారు. అదేసమయంలో డ్రగ్స్ కేసుల ప్రభావం కోలీవుడ్ వీకెండ్ పార్టీలపై తీవ్ర ప్రభావం చూపిందనే ప్రచారం ఉంది.



శ్రీకాంత్, అమీర్, కృష్ణ

చిత్రజ్యోతి

విజయ్ లేకుండా 'ఎల్‌సీయూ' లేదు

● లోకేష్ కనకరాజ్



'దళపతి' విజయ్ లేకుండా 'లోకి సినిమాటిక్ యూనివర్స్' (ఎల్‌సీయు) ఉండదని యంగ్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ అన్నారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో లోకేష్ మాట్లాడుతూ, 'విజయ్ లేకుండా 'ఎల్‌సీయు' చిత్రాలు ఉండవు. అయితే, విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టడం వల్ల సినిమాలకు అందుబాటులో ఉంటాడో లేదో తెలియదు. ప్రస్తుతం విజయ్ లక్ష్యం ఏమిటో మనందరికీ తెలుసు. అదేసమయంలో ఆయన లేకుండా మాత్రం ఎల్‌సీయు ఉండదని నేను గట్టిగా చెప్పగలనన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇపుడు చర్చనీయాంశంగా మారాయి. భవిష్యత్‌లో లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహించే చిత్రాల్లో విజయ్ నటింపజేయడం లేదా, అతని వాయిస్ ఉపయోగించుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

విన్సెంట్ విజయ్ హీరోగా 'మక్కల్ తొడర్బాలన్'

విన్సెంట్ విజయ్ హీరోగా 'మక్కల్ తొడర్బాలన్' పేరుతో ఒక చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రం ప్రారంభోత్సవ పూజా కార్యక్రమం తాజాగా నగరంలో జరిగింది. ఇందులో ముంబై మోడల్ చైత్ర, బెంగళూరుకు చెందిన రీనా సహా అనేక మంది కొత్త నటీనటులు నటించనున్నారు. నటుడు సంపత్ ఒక ముఖ్య పాత్ర పోషించనున్నారు. స్టోరీ, స్క్రీన్‌ప్లే, మాటలను సమకూర్చిన హెచ్.మురుగన్ దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టారు. ఈ చిత్ర వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'బాల్యం నుంచే సినిమాపై ఆసక్తి కలిగిన ఓ యువకుడు... నిత్యం సినిమాలు చూస్తూ, స్టేజ్‌పై నటిస్తుంటాడు. ఎలాంటి పని చేయకుండా ఊర్లు తిరుగుతూ, ఖాళీ సమయాల్లో ఆడకుంటూ జులాయ్‌గా ఉంటాడు. అలాంటి యువకుడు సినిమాల్లో నటించేందుకు తీసుకున్న చర్యలు ఏంటి? అందులో విజయం సాధించారా? లేదా? అన్నదే ఈ చిత్ర కథ. హెచ్.మురుగన్ గ్రీన్ చానెల్ మూవీస్ పతాకంపై రూపొందిస్తున్నారు. ముంబై, బెంగుళూరు, తిరుచ్చి, మదురై, ఏర్కాడు, కరూర్, చెన్నై తదితర ప్రాంతాల్లో షూటింగ్ చేసేలా ప్లాన్ చేసినట్టు వెల్లడించారు.



కొత్త చిత్రం ప్రారంభోత్సవ దృశ్యం

కన్నియాకుమారి జిల్లాలో ధాన్యం పూజలు

● ఆలయాల్లో సందడి

ప్యారీస్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలో ఆడిమాసం సందర్భంగా కొత్తధాన్యం పూజలతో ఆలయాలు కళకళలాడాయి. బుధవారం తెల్లవారుజామున 5.30 నుంచి 6.30 గంటల మధ్య శుభముహూర్తంలో రైతులు తమ పొలాల్లో కోతకొచ్చిన వడ్ల గింజలను కట్టలుగా కట్టి కన్నియాకుమారి మెయిన్ రోడ్డులో ఉన్న శాస్త్ర ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత భక్తుల నామస్మరణ, మేళతాళాల మధ్య ప్రధాన వీధుల మీదుగా కన్నియాకుమారిలోని భగవతియమ్మన్ ఆలయానికి తీసుకెళ్ళారు. ఆలయంలోని మూలస్థాన మండపంలోని భగవతియమ్మన్ ముందు వరికంకులను నివేదించి పంటలు సంవృద్ధిగా పండాలని, సకాలంలో వర్షాలు పడాలని కోరుతూ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వరికంకులతో అల్లిన మాలను సమర్పించి ఆ తర్వాత వాటిని ప్రసాదంగా స్వీకరించారు. ఈ వరిధాన్యాన్ని జిల్లాలోని భక్తులందరూ తమ ఇళ్ళు, కర్మాగారాల్లో అలంకరించుకున్నారు. అన్నదాతలు కొత్త ధాన్యాన్ని తమ పొలాల్లో చల్లుకున్నారు. ఈ కొత్త ధాన్యం పూజలను జిల్లాలోని ఆలయాల్లో ఏక కాలంలో నిర్వహించారు. విశ్వరూప దర్శనం, నిర్మాల్య పూజ, ప్రత్యేక అభిషేకం, అలంకారం, దీపారాధన శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆడి మాసం పూజల కోసం మండక్కాడు భగవతియమ్మన్ ఆలయంలో బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి 4.30 గంటల వరకు ఉత్సవ మూర్తికి పంచాభిషేకం, ధాన్యాలతో పూజలు నిర్వహించారు. అదేవిధంగా సుచీంద్రం స్థానుమలయన్ స్వామి ఆలయం, నాగర్‌కోవిల్‌లోని నాగరాజ ఆలయం, తిరువొట్టాన్‌లోని ఆదికేశవ పెరుమాళ్ ఆలయం, వెల్లిమలైలోని సుబ్రహ్మస్వామి ఆలయం సహా జిల్లాలోని పలు ఆలయాలు ప్రత్యేక పూజలకు పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడాయి.



ఆలయంలో కొత్త ధాన్యం పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

'బిడ్ ఫీ' ఆధ్వర్యంలో పెయింటింగ్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి మాఫాయ్ పాండ్యరాజన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంస్థ నిర్వాహకులు

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రీమ్స్‌రోడ్డులోని లలిత కళా అకాడమీలో ప్రాచీన కళాత్మకవస్తువుల వేలం గృహం 'బిడ్ ఫీ' ఆధ్వర్యంలో జరిగింది. రాజా, హుస్సైన్, రేఖారాయ్, ఆర్కే లక్ష్మణ్, తోటతరణికి చెందిన వర్ణచిత్రలు, చిత్రలేఖనాలు, నోట్లు, కొయ్య ప్రాచీన వస్తువులతో ఏర్పాటు చేసిన ప్రదర్శన నగరవాసులను ఆకట్టుకుందని ఎగ్జిబిషన్ నిర్వాహకులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌ను మాజీ మంత్రి మాఫాయ్ పాండ్యరాజన్ ప్రారంభించారు. బిట్ ఫీ వ్యవస్థాపకుడు కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో రూ.20 కోట్ల విలువైన పెయింటింగ్‌లు ప్రదర్శనకు ఉంచామని ఆసక్తిగలవారు వీటిని వేలం పాటలో దక్కించుకోవచ్చునని, గురువారం సాయంత్రం వరకూ ఈ ప్రదర్శన కొనసాగుతుందని కిషోర్ తెలిపారు. ప్రాచీన కాలం నాటి నాణేలు, వర్ణచిత్రాలు, కెమెరాలు, రేడియోలు కూడా ఈ ప్రదర్శనలో ఉన్నాయి.

ఏకే 47 సహా పలు తుపాకుల పరిశీలన



తుపాకుల పనితీరు పరిశీలిస్తున్న డీఎస్పీ కరుప్పస్వామి

పెరంబూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఏకే 47 సహా పలు రకాల తుపాకులు సక్రమంగా పనిచేస్తున్నాయా? లేదా అని అధికారులు పరిశీలించారు. సేలం అస్తంపట్టిలోని సాయుధ దళ మైదానంలో ఉంచిన తుపాకులను చెన్నై నుంచి వచ్చిన డీఎస్పీ కరుప్పస్వామి పరిశీలించారు. పోలీసు, జైళ్ల, అటవీ శాఖ సిబ్బంది వినియోగిస్తున్న తుపాకులను ఆయన పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు వినియోగించే తుపాకులు సక్రమంగా పనిచేస్తున్నాయా? లేదా అని పరిశీలిస్తున్నట్లు డీఎస్పీ కరుప్పస్వామి తెలిపారు.

పెట్టుబడుల సమీకరణలో రాష్ట్రం ముందంజ

● డిప్యూటీ సీఎం ఉదయనిధి

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ, విదేశీ పెట్టుబడుల సమీకరణలో రాష్ట్రం ముందంజలో ఉందని, కొత్త పరిశ్రమల ఏర్పాటుకు సులభతరమైన ఏకగవాక్ష పద్ధతిలో అనుమతులిచ్చే రాష్ట్రం కూడా ఇదేనని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి అన్నారు కోట్టూరుపురంలోని అన్నా సెంటినరీ లైబ్రరీలో బుధవారం ఉదయం రాష్ట్ర సమాచార సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన రాష్ట్ర నూతన మేథో సంపత్తి హక్కుల పరిరక్షణ తొలి సదస్సులో ఆయన ప్రసంగించారు. ఆ సందర్భంగా ఏర్పాటైన ప్రదర్శనలో రాష్ట్రానికి చెందిన 16 మంది పరిశోధకుల పేటెంట్ పొందిన నూతన ఆవిష్కరణలను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ ద్రావిడ తరహా పాలనను అందించే డీఎంకే ప్రభుత్వం కొత్త అన్వేషణలకు, పరిశోధనలకు అగ్రతాంబూలం ఇస్తుందన్నారు. 'నాన్ ముదల్వన్' పథకం ద్వారా విద్యార్థులు సమాచార సాంకేతిక శాఖలో ప్రతిభాపాటవాలను పెంపొందించుకోగలుగుతున్నారని తెలిపారు. ఈ సదస్సులో మంత్రి పళనివేల్ త్యాగరాజన్, రాష్ట్ర నిధుల సంస్థ ఉపాధ్యక్షుడు జే జయరంజన్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో యాంత్రిక పరికరాలను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి

దిండివనం సమీపంలో అయ్యనార్ విగ్రహం లభ్యం



టీనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలోని అన్నంపుదూరు గ్రామంలో పల్లవరాజుల కాలం నాటి అయ్యనార్ శిలా విగ్రహం లభ్యమైనట్లు విల్లుపురం చారిత్రక పరిశోధకులు కె.సెంగుటువన్ తెలిపారు. అన్నంపుదూరు చెరువులో సన్యాసిమేడు ప్రాంతం వద్ద ఈ విగ్రహం లభించిందని, ఈ విగ్రహాన్ని స్థానికులు సన్యాసి స్వామి అని పిలుస్తున్నారని చెప్పారు. అయితే విగ్రహం ఆకారాన్ని బట్టి అది అయ్యనార్ విగ్రహమేనని నిర్ధారించినట్లు తెలిపారు. కర్ణాభరణాలు, చేతికి, కాలికి కడియాలు, ఛాతీపై కవచాన్ని ధరించిన ఈ అయ్యనార్ నడుముకు పిడిబాకు కూడా ఉందని తెలిపారు. కుడి చేతిని మోకాలుపై ఆనించి, ఎడమచేతిని తొడపై ఆనించి మహారాజ లీలాసనంలో గాంభీర్యంగా కనిపిస్తోందన్నారు. తమ పరిశోధనల ప్రకారం ఈ విగ్రహం ఏడో శతాబ్దానికి చెందినదని నిర్ధారించినట్లు ఆయన వివరించారు.

జలవనరుల సంరక్షణ అందరి బాధ్యత



సదస్సులో అతిథులు, నిర్వాహకులు

వాషర్‌మెన్‌పేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రసాదించిన జలవనరుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సదస్సులో పలువురు వక్తలు తెలిపారు. టీనగర్‌కు చెందిన జ్యోతి మాదర్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం తారాచంద్ గలాడా జైన్ మెట్రిక్యులేషన్ హైయ్యర్ సెకండరీ స్కూలులో 'నీటి సంరక్షణ - పారిశుద్ధ్యం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు స్కూలు ప్రిన్సిపాల్ డా.సీత రంజిత్ అధ్యక్షత వహించగా, జ్యోతి మాదర్ సంఘం అధ్యక్షులు లక్ష్మీ రఘుకుమార్ ఆహ్వానం పలికారు. ముఖ్యఅతిథిగా ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్ అధ్యక్షులు పద్మ వెంకటరామన్, గౌరవ అతిథిగా ఆర్‌ఐ డిస్ట్రిక్ట్ 3234 ఎన్విరాన్‌మెంట్ చైర్ రవి సుందరేశన్ పాల్గొని, నీటి ప్రాధాన్యత, సంరక్షణ, పరిశుభ్రత తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణపై నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

చెన్నై పోర్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.2.45 కోట్ల ఆర్థికసాయం



పోర్ట్ ట్రస్ట్‌ల తరుపున విరాళాలు అందజేస్తున్న ఐఏఎస్ అధికారులు సునీల్ పాలివాల్, ఎస్.విశ్వనాథన్, ఐరీన్ సింధ్య తదితరులు

ప్యారీస్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చెన్నై పోర్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరామకృష్ణ మఠం, మద్రాస్ మెడికల్ కళాశాల (ఎంఎంసీ), స్వబోధిని చారిటబుల్ ట్రస్ట్, పెన్ ట్రస్ట్ టిష్కై అనే సంస్థల సామాజిక సంక్షేమ పథకాలకు రూ.2.45 కోట్ల ఆర్థికసహాయాన్ని అందజేసింది. చెన్నై పోర్ట్ ట్రస్ట్, ఎన్నూరు కామరాజర్ పోర్ట్ ట్రస్ట్ నికర లాభం నుంచి సుమారు 2 శాతం వరకు సామాజిక సేవా కార్యక్రమాలు చేసే సంస్థలకు ప్రతిఏటా విరాళం అందజేస్తుంటారు. ఆ రీతిలో చెన్నై పోర్ట్ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మెన్ ఎస్.విశ్వనాథన్, కామరాజర్ పోర్ట్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ ఐరీన్ సింధ్య, చెన్నై, కామరాజర్ పోర్ట్ ట్రస్ట్‌ల చైర్మన్ సునీల్ పాలివాల్ ఈ ఆర్థిక సాయం అందజేశారు.

ఐరిస్ ఫ్యాషన్ వేడుకలు ప్రారంభం

● సెప్టెంబరు 27వ ఫైనల్స్



ఐరిస్ ఫ్యాషన్ వేడుకల ప్రారంభ దృశ్యం

అడయార్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఐరిస్-25 ఫ్యాషన్ వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ ఫ్యాషన్ ఈవెంట్స్ ఫైనల్స్ సెప్టెంబరు 27వ తేదీ నిర్వహించనున్నారు. ఐరిస్ ఫేస్ ఆఫ్ చెన్నై-2025, ఐరిస్ ఫేస్ ఆఫ్ తమిళనాడు-2025ను వరల్డ్ ఫాటిస్ట్ గ్రోయింగ్ సెలూన్ నేచురల్స్, గ్రాండ్ చెన్నై జీఆర్‌టీ హోటల్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఐరిస్ ఫేస్ ఆఫ్ చెన్నైలో శ్రేయా గుప్తా, దుషారా విజయన్, సంయుక్త విశ్వనాథన్, అభిరామి అయ్యర్, తరిని కళింగరాయర్, సుజా సూర్య నిలా, అను సింగ్, నిరూప్ నందకుమార్, అఖిలన్, మునాఫ్ రెహ్మాన్, సోఫియా, మానస చౌదరి, రమీజ్ మీరన్ వంటి అనేక మంది మంది యంగ్ మోడల్స్, సెలెబ్రిటీలు పాలుపంచుకుంటారని నిర్వాహికులు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజా గ్రీవెన్స్‌లో 21 వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ అరుణ్

పెరంబూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అరుణ్ పాల్గొని, ప్రజల నుంచి 21 వినతిపత్రాలు స్వీకరించడంతో పాటు వారి సమస్యలు విన్నారు. అనంతరం, ఈ సమస్యలను విచారించి పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ల అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రతి బుధవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజలు పాల్గొని, తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని నగర పోలీసు కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది.

ఆడి కృత్తిక ఉత్సవాలపై కలెక్టర్ సమీక్ష

తిరుత్తణి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని మురుగన్ ఆలయంలో ఆగస్టు 14న ప్రారంభం కానున్న ఆడి కృత్తిక ఉత్సవాలకు సంబంధించి కలెక్టర్ ప్రతాప్ బుధవారం ఉదయం అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో సుమారు 10 లక్షల మందికి పైగా భక్తులు కొండకు కావళ్లతో తరలివస్తారని, ఈ క్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించాలని, అదే విధంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రతాప్ అధికారులను ఆదేశించారు. అనంతరం బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, వైద్య శిబిరాలు, తాగునీరు తదితర వసతులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కనిమొళి, ఆలయ కమిషనర్ రమణి సహా పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రతాప్

అటవీ సంరక్షణపై అవగాహన

● బడిపిల్లల పర్వతారోహణ


చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎత్తయిన కొండపై పచ్చదనం పరచుకున్న ప్రకృతి సౌందర్యాన్ని తిలకించి ఆ బడిపిల్లలు ఆనందంతో ఎగిరి గంతులేశారు. చల్లటి గాలులు మధ్య పక్షుల కిలకిలారావాలను ఆస్వాదిస్తూ, వందల సంఖ్యలో ఎగురుతున్న సీతాకోచిలుకలను, జింకలను చూసి తన్మయత్వం చెందారు. తెన్‌కాశి జిల్లా పడమటి కనుమల్లో అటవీ సంరక్షణపై అవగాహన కల్పించేలా అటవీ శాఖ అధికారులు వాసుదేవనల్లూరు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పర్వతారోహణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవకులు సహా మొత్తం వంద మంది పర్వాతారోహణం చేశారు. ఎనిమిది కిలోమీటర్లున్న ఎత్తయిన కొండ చివరకు అటవీ శాఖ సిబ్బంది తీసుకెళ్ళారు. ఎత్తయిన ప్రాంతంలో ప్రకృతి సౌందర్యాలను చూసి ఆనందించారు. సుమారు ఆరుగంటలపాటు కొండపైనే గడిపి తిరిగొచ్చిన విద్యార్థులందరికీ అటవీ శాఖ ఉన్నతాధికారులు సర్టిఫికెట్లు, కానుకలను అందజేశారు. ఈ ట్రెక్కింగ్‌ను జీవితాంతం మరచిపోలేమని, అటవీ శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని ఆ చిన్నారులు పేర్కొన్నారు.





ట్రెక్కింగ్‌లో పాల్గొన్న బాలికలకు అండగా వెళుతున్న అటవీ సిబ్బంది - కొండపై సేదతీరుతున్న విద్యార్థులు

నగదు మోసం కేసులో నటుడు శ్రీనివాసన్ అరెస్టు



ప్యారీస్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తమిళ సినీనటుడు పవర్‌స్టార్ శ్రీనివాసన్‌ను నగదు మోసం కేసులో ఢిల్లీ ఆర్థికనేర విభాగం పోలీసులు అరెస్టు చేశారు. రూ.1000 కోట్లు రుణాలు ఇప్పిస్తామని నమ్మించి రూ.5 కోట్లు పుచ్చుకుని ఓ చిత్రనిర్మాణం, సొంత ఖర్చులకు వాడుకుని మోసం చేసినట్లు పవర్‌స్టార్ శ్రీనివాసన్‌పై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయనపై నగరంలో మరో ఆరు మోసం కేసులు పెండింగులో ఉండటంతో తనను పోలీసులు అరెస్టు చేస్తారన్న అనుమానంతో పవర్‌స్టార్ 2018నుంచి అజ్ఞాతంలోకి వెళ్ళారు. అతను నేరస్థుడని పోలీసులు రెండుసార్లు ప్రకటించిన నేపథ్యంలో ఢిల్లీ ఆర్థిక విభాగం పోలీసులు బుధవారం అరెస్టు చేసినట్లు సమాచారం.




చెత్త సేకరించే ఆటోలో లభ్యమైన ఓటరు గుర్తింపు కార్డులు, పోలింగ్ సామగ్రి

శానిటేషన్ వాహనంలో ఓటరు గుర్తింపు కార్డులు..!

● కడలూరు జిల్లాలో కలకలం

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా మంజుకుప్పం వద్ద బుధవారం ఉదయం పార్కింగ్ చేసి ఉంచిన చెత్తకుప్పల వాహనంలో కట్టలుగా పడి ఉన్న కల్లకురిచ్చి జిల్లాకు చెందిన ఓటరు గుర్తింపు కార్డులు చూసి పారిశుద్య కార్మికులు, అధికారులు దిగ్భ్రాంతి చెందారు. మంజకుప్పం బిల్లుకడై వీధిలో కార్పొరేషన్‌కు చెందిన చెత్త సేకరించే వాహనాలను రాత్రిపూట పార్కింగ్ చేస్తారు. ఆ మేరకు మంగళవారం రాత్రి పార్కింగ్ చేసిన ఓ వాహనాన్ని శుభ్రం చేసేందుకు పారిశుద్య కార్మికులు మంగళవారం ఉదయం వెళ్ళారు. అందులో వందల సంఖ్యలో ఓటరు గుర్తింపు కార్డులు, పోలింగ్ బూత్‌లో ఉపయోగించే సిరా, సీలు వేసేందుకు ఉపయోగించే సామగ్రి కనిపించాయి. వెంటనే వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్పొరేషన్ ఉన్నతాధికారులు, రెవెన్యూ అధికారులు హుటాహుటిన అక్కడికి వెళ్ళి పరిశీలించారు. కడలూరు తహసీల్దార్ మహేష్ అక్కడికి వెళ్ళి ఓటరు గుర్తింపు కార్డులు, పోలింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఆ ఓటరు గుర్తింపు కార్డులన్నీ కల్లకురిచ్చి జిల్లాకు చెందినవిగా గుర్తించారు. ఇదిలా ఉండగా ఓటరు గుర్తింపు కార్డులు లభించిన లారీకి సంబంధించిన వైర్లు తెగి ఉండటంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని వాటిని తెంచిన దుండగుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు




తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.89 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,183

తలనీలాలు సమర్పించినవారు: 25,906



రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం

షార్‌లో సంబరం

● జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 ప్రయోగం సక్సెస్
● నిర్ణీత కక్ష్యలోకి నిసార్ ఉపగ్రహం
● ఈ ఏడాది ఇస్రోకు తొలి విజయం
● షార్‌లో అంబరాన్నంటిన సంబరాలు

సూళ్లూరుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రయోగానికి 27.30 గంటల ముందు.. మంగళవారం తెల్లవారుజామున 2.10 గంటలకు కౌంట్‌డౌన్ మొదలైంది. '0'కి చేరగానే.. సమయం బుధవారం సాయంత్రం 5.40 గంటలు అయింది. అంతే ఒక్కసారిగా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ నిప్పులు చెరుగుతూ.. నింగిలోకి దూసుకెళ్లింది. రాకెట్ మూడు దశలను విజయవంతంగా పూర్తిచేసి 18.40 నిమిషాల్లోనే 2,392 కిలోల బరువైన నిసార్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇస్రో-నాసా సంయుక్తంగా చేపట్టిన ఈ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైనట్లు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ ప్రకటించడంతో షార్‌లో సంబరాలు మిన్నంటాయి. శాస్త్రవేత్తలు ఆనందోత్సాహాలతో ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. ఈ విజయం.. రోదసి ప్రయోగాల్లో మరోసారి మన శాస్త్రవేత్తల సత్తా చాటింది. ఈ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి సుమారు ఆరువేల మంది దాకా వచ్చారు. ఎండను సైతం లెక్కచేయకుండా రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు వీక్షకులు మధ్నాహ్నమే షార్‌కు తరలివచ్చారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులున్నారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు తెల్లవారుజామునుంచే వాహనాలు బారులు తీరాయి. రాకెట్ నింగికి ఎగురుతున్న సమయంలో వీక్షకుల చప్పట్లు, ఈలలు, కేకలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో వీక్షకులు గ్యాలరీ వద్దే ఆనందంతో సంబరాలు చేసుకొన్నారు.

సవాల్‌గా తీసుకుని..

ఈ ఏడాది జనవరి 29న ప్రయోగించిన జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 ప్రయోగం అనంతరం ఉపగ్రహ సంకేతాలు అందలేదు. అనంతరం మే 18న ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ 61 ప్రయోగం విఫలమైంది. ఈ రెండు వైఫల్యాలను శాస్త్రవేత్తలు సవాల్‌గా తీసుకున్నారు. మూడోసారి.. అత్యంత ఖరీదైన, నాసా, ఇస్రో సంయుక్తంగా అభివృద్ధి చేసిన నిసార్ ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో మన శాస్త్రవేత్తలకు అగ్రదేశాల నుంచీ ప్రశంసలు అందాయి. కాగా, ఈ ఏడాది



వీక్షకుల గ్యాలరీలో విద్యార్థుల సందడి



చరిత్రలో నిలిచిపోయే ప్రయోగం

ఇది చరిత్రలో నిలిచిపోయే ప్రయోగం. బుడిబుడి అడుగుల నుంచి నేడు స్వదేశీ పరిజ్ఞానంతో అమెరికా వంటి అగ్రదేశంతో కలిసి భారీ ప్రయోగాలు చేపట్టే స్థాయికి ఎదిగాం. ఇదంతా మన శాస్త్రవేత్తల సమష్టి కృషి ఫలితమే. ఊహించిన ప్రకారమే నిసార్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టాం. ఇది ఇస్రో,నాసా సంయుక్త విజయం.

- వి.నారాయణన్, ఇస్రో ఛైర్మన్

మాట్లాడుతున్న ఇస్రో ఛైర్మన్ నారాయణన్

నిప్పులు చిమ్ముతూ నింగిలోకి వెళ్తున్న జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్




ప్రయోగాన్ని వీక్షిస్తున్న నాసా శాస్త్రవేత్తలు


ఇస్రోకు ఇది తొలి విజయం. కాగా, భూ పరిశీలన, సునామీ, విపత్తుల హెచ్చరికలు ముందుగానే పసిగట్టి సమాచారాన్ని చేరవేసేందుకు నిసార్ ఎంతో దోహదపడనుంది.

రాకెట్ వీక్షణకు ఇస్రో మాజీ ఛైర్మన్లు

షార్ వేదికగా జరిగిన నిసార్ ఉపగ్రహ ప్రయోగ వీక్షణకు ఇస్రో మాజీ ఛైర్మన్లు డాక్టర్ కె.రాధాకృష్ణ, ఏఎస్.కిరణ్ కుమార్ విచ్చేశారు. వీరితో పాటు పలువురు శాస్త్రవేత్తలు కూడా విచ్చేసి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని తిలకించారు.







రాకెట్ మొదటి, రెండవ, మూడవ దశలు

ఆరాధనలకు ప్రామాణికం జ్ఞానకాండ గ్రంథం

తిరుమల, జూలై30(ఆంధ్రజ్యోతి): కశ్యప మహర్షి అందించిన జ్ఞానకాండ గ్రంథం అసంఖ్యాక వైఖానస ఆలయాల్లో నిర్వహించే ఆరాధనలకు అత్యంత ప్రామాణికమని పండితులు పేర్కొన్నారు. తిరుమలలోని ఆస్థానమండపంలో శ్రీవైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ, టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బుధవారం వైఖానస మహర్షి శిష్యుల్లో ఒకరైన కశ్యప మహర్షి తిరు నక్షత్రోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పండితులు ప్రసంగిస్తూ కశ్యప మహర్షి అందించిన జ్ఞానకాండ గ్రంథం ఆలయ నిర్మాణానికి, భూ పరీక్ష, శంకుస్థాపన, ఆలయ నిర్మాణ శైలి, మండపం నిర్మాణం, విగ్రహ నిర్మాణం, ప్రతిష్టా విధానాలు వంటి సమగ్ర జ్ఞానం సమాజానికి అందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఖానస సభ కార్యదర్శి శ్రీనివాస దీక్షితులు, విఖానస ట్రస్టు కార్యదర్శి ప్రభాకరాచార్యులు, వేదవిజ్ఞానపీఠం పండితులు శ్రీనివాస దీక్షితులు, టీటీడీ పురాణ పండితులు వాకాణి రామకృష్ణ శేషసాయి, వేదవిజ్ఞాన పీఠం అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర పండితులు పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.2.68కోట్లు



శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి హుండీ ద్వారా రూ.2,68,87,640 లభించింది. ఆలయంలోని కోట మండపం వద్ద బుధవారం హుండీలను లెక్కించారు. హుండీల ద్వారా బంగారం 97 గ్రాములు, వెండి 882.640 కేజీలు, విదేశీ కరెన్సీ 235 వచ్చాయి. 40 రోజులకు ఈ హుండీ ఆదాయం వచ్చినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు.

నలుగురు దొంగల ముఠా అరెస్టు

● పరారీలో మరో ఇద్దరు ● రూ.20.4 లక్షల నగలు, రెండు బైకులు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూలై 30 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు పోలీసులు బుధవారం కరుడుగట్టిన నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేశారు. ఈ వివరాలను తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం నమక్కల్ జిల్లా సేరిక్కలై గ్రామానికి చెందిన ఎం.మణి అలియాస్ కోవిల్‌మణి, ఎం.సురేష్ స్నేహితులు. వీరు తమిళనాడుతో పాటు పలు ప్రాంతాల్లో ఇంటి దొంగతనాలకు పాల్పడేవారు. అలాగే, తిరుపతి నగరం మంగళం పరిధిలోని తిరుమల నగర్‌కు చెందిన స్నేహితులు కుమార్, మణికంఠ చిన్న చిన్న దొంగతనాలు చేసేవారు. అయితే వీరు గతంలో తమిళనాడులో దొంగతనాలు చేసి వేలూరు జైలులో ఉండగా, తమిళనాడుకు చెందిన ఇద్దరు నిందితులతో పరిచయమైంది. ఆ తర్వాత ఈ నలుగురూ కలిసి కొన్నేళ్ళుగా తమిళనాడుతో పాటు ఏపీలోని పలు జిల్లాల్లో ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల నెల్లూరులోని పలు ప్రాంతాల్లో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ ఘటనల్లో నెల్లూరు పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని, వేలిముద్రలు పరిశీలించారు. వీరు చంద్రగిరి, పుత్తూరు పోలీసు స్టేషన్ల పరిధిలో ఇళ్ల తాళాలు పగులకొట్టి బంగారు నగలు అపహరించుకుని వెళ్ళారు. ఈనెల 15న ఏర్పేడు పోలీసు స్టేషన్ పరిధిలో ఇంటి ముందు నిలిపిన బైకును దొంగలించి నెల్లూరు వెళ్లారు. అక్కడ నవాబ్‌పేటలో ఇంటి ముందు ఆపి వున్న మరో ద్విచక్ర వాహనాన్ని దొంగలించారు. ఈ రెండు మోటారు సైకిళ్లలో తిరుగుతూ పగటి పూట రెక్కీ నిర్వహించి రాత్రి పూట ఇంటి దొంగతనాలకు పాల్పడేవారు. ఈ కేసుల్లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దొంగల కోసం వేట మొదలు పెట్టారు.

క్రైం అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో..

పుత్తూరు, ఏర్పేడు, చంద్రగిరి, గాజులమండ్యం పరిధిలోని పెనుబాల కళాశాలలో జరిగిన దొంగతనం కేసుల్లో నిందితులను పట్టుకోవడానికి ఎస్పీ హర్షవర్ధనరాజు తిరుపతి క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు, పుత్తూరు డీఎస్పీ రవికుమార్ నేతృత్వంలో తిరుపతి క్రైం సీఐలు ప్రకాష్, శివకుమార్ రెడ్డి, రూరల్ సీఐ రవీంద్ర, పుత్తూరు, కేవీబీ పురం, పిచ్చాటూరు ఎస్ఐలు ఓబయ్య, నరేష్, వెంకటేష్‌లతో పాటు జిల్లా క్రైం పార్టీలు దాము, నాగరాజు, రమేష్, మోహన్, రాజశేఖర్, భారుష, రవిప్రకాష్, మోహన్, మునిరత్నంను బృందాలుగా ఏర్పాటు చేశారు. వీరు పలు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో బుధవారం పుత్తూరు- చెన్నై హైవేలోని సిరుగురాజుపాలెం సమీపంలో మురుగన్‌గుడి వద్ద నలుగురు నిందితులు ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. వారి నుంచి దాదాపు రూ.20.40 లక్షల విలువ చేసే 190 గ్రాముల బంగారు నగలు, 2.3 కిలోల వెండి వస్తువులు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసుల్లో తమిళనాడు రాష్ట్రం చిదంబరానికి చెందిన ఎం.ప్రభు, వేలూరు జిల్లా అనైకట్టుకు చెందిన మణిగండన్ పరారీలో ఉన్నారు. కాగా, అరెస్టయిన వారిలో మణిపై 50, సురేష్‌పైన 15, కుమార్‌పై 18, మణికంఠపై 18 చొప్పున కేసులున్నాయి. ఈ కేసుల్లో ప్రతిభ కనపరచిన వారిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందచేశారు.



పుత్తూరు పోలీసులు రికవరీ చేసిన నగలు, వెండి వస్తువులను పరిశీలిస్తున్న ఎస్పీ

బ్యాంకర్లూ.. భద్రతా చర్యలు తీసుకోండి

● 'హిందూపురం' ఘటనతో అప్రమత్తం చేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 30(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో జరిగిన బ్యాంకు దోపిడీ ఘటనతో తిరుపతి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా బుధవారం పోలీసు అధికారులు బృందాలుగా అన్ని బ్యాంకుల అధికారులు, ఉద్యోగులను అప్రమత్తం చేశారు. ప్రతి బ్యాంకు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, పూర్తి సామర్థ్యంతో సెక్యూరిటీ ఉండాలని సూచించారు. అనుమానితులు బ్యాంకుల వద్ద తిరుగుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో డీఎస్పీ భకతవత్సలం ఆధ్వర్యంలో సీఐలు శ్రీనివాసులు, రాంకిషోర్, మురళీమోహన్, రామయ్య, ఎస్ఐలు తమ పరిధిలోని బ్యాంకుల వద్దకు వెళ్లి భద్రతకు సంబంధించి సలహాలు, సూచనలు ఇచ్చారు. రానున్న వారం రోజుల్లో సీసీ కెమెరాలు, సెక్యూరిటీ నియామకాలు పూర్తిచేసి మీ బ్యాంకులకు మీరే భద్రత ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

విద్యుత్ బస్సులతో డీజిల్ ఆదా

ఐసిఎఫ్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో నడుపుతున్న విద్యుత్ బస్సులతో నెలలో రూ.90 లక్షల డీజిల్ ఖర్చు ఆదా అయినట్లు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ (ఎంటీసీ) అధికారులు తెలిపారు. నగరంలో ప్రస్తుతం 120 విద్యుత్ బస్సులు నడుపుతున్నారు. ఈ బస్సులు నెలరోజుల్లో 6.55 లక్షల కి.మీ నడువగా, నెలరోజుల్లో 12.80 లక్షల మంది ప్రయాణించారు. సాధారణ బస్సులకు డీజిల్ కోసం నెలకు రోజుకు రూ.1.60 కోట్లు ఖర్చవుతుండగా, విద్యుత్ బస్సుల రాకతో రూ.90 లక్షలు ఆదా అయినట్లు ఎంటీసీ అధికారులు తెలిపారు.

విడిభాగాల అపహరణ: ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరం ప్రాంతంలో వాహన విడిభాగాలు అపహరించిన ఇద్దరు యువకులను అరెస్టు చేసిన పోలీసులు వారి నుండి రెండు బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నారు. పాత వాహనాలను కొనుగోలు చేసి వాటి విడిభాగాల వ్యాపారం చేస్తున్న పాండ్యన్ మార్చి 11న మాధవరం ప్రాంతంలో తన మిత్రుడి వద్ద వోల్వో బస్సు కొనుగోలు చేశారు. అందులోని ఏసీ, విడిభాగాలు, బ్యాటరీలు విడదీసి పక్కనే ఉన్న మరో వాహనంలో ఉంచారు. మరుసటి రోజు ఉదయం విడిభాగాలు మాయం కావడంతో ఆయన మాధవరం క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు అదే ప్రాంతానికి చెందిన కార్తిక్ (21), లోకేష్ (20)అనే యువకులను అరెస్టు చేసి వారినుంచి రెండు బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం వారిని కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రైలు నుంచి జారిపడి వివాహిత మృతి

ఐసిఎఫ్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూర్ జిల్లా వాణియంబాడి సమీపంలో రైలు నుంచి జారిపడి కేరళకు చెందిన ఓ మహిళ మృతిచెందింది. కేరళ రాష్ట్రం త్రిశూర్‌కు చెందిన రాజేష్-రోహిణి దంపతులకు రెండేళ్ల కుమార్తె ఉంది. రాజేష్ తండ్రి చెన్నైలో ఉండడంతో, అతడిని చూసేందుకు భార్యా కుమార్తెతో తిరువనంతపురం నుండి రైల్లో బయల్దేరాడు. జోలార్‌పేట సమీపంలో రైలు వస్తున్న సమయంలో రాజేష్, రోహిణి టాయిలెట్‌కు వెళ్లారు. రాజేష్ తిరిగి తన సీటు వద్దకు చేరుకోగా, రోహిణి చాలాసేపటి వరకు రాకపోవడంతో అనుమానించిన రాజేష్, టాయిలెట్‌కు వెళ్లి చూడగా ఆమె కనిపించలేదు. దీంతో, కాట్పాడి, జోలార్‌పేట రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆమె కోసం గాలించగా, జోలార్‌పేట సమీపం పుదుకోల్ ప్రాంతంలోని రైలు పట్టాల పక్కన రోహిణి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించిన రైల్వే పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

గ్రూప్-1లో తగ్గిన కటాఫ్ మార్కులు

● ఉద్యోగి ఆత్మహత్య

ఐసిఎఫ్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్షల్లో కటాఫ్ మార్కులు తగ్గడంతో ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శివగంగ జిల్లాలో చోటుచేసుకుంది. అల్లినగరం గ్రామానికి చెందిన రాజేంద్రన్ కుమారుడు నటరాజన్ (27) దివ్యాంగుడైన ఇతను గతంలో నిర్వహించిన గ్రూప్-4 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఏడాది కాలంగా తిరుభువనం యూనియన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గ్రూప్-1 రాసిన నటరాజన్, ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. అక్కడ అతను ఆశించిన కటాఫ్ మార్కులు రాకపోవడంతో మనస్తాపం చెందినట్లు సమాచారం. ఘటన జరిగిన రోజున తండ్రి కూలీపనులకు పొరుగూరు వెళ్లడం, తల్లి ఉపాధి పనులకు వెళ్లడంతో, ఇంట్లో ఒంటరిగా ఉన్న నటరాజన్ ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న తిరుభువనం పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.